


Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక





బుధవారం 21-01-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :1 | సంచిక : 225 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

## అక్షయ్ కుమార్ వాహనానికి ప్రమాదం




## మున్సిపల్ ఎన్నికలు..

### ఆశావహులతో కవిత కీలక భేటీ




## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థి మృతి




## అభద్రతా భావంలో కేరళ పురుషులు




## బీజేపీ నూతన అధ్యక్షుడిగా నితిన్ నబీన్.. ఘనంగా సత్కరించిన ప్రధాని మోదీ




## శబరిమల బంగారం చోరీ కేసు.. 3 రాష్ట్రాల్లో ఈడీ సోదాలు




## నోబెల్ బహుమతిపై ట్రంప్ సంచలన నిర్ణయం




# టీజీ జెన్‌కో బదిలీలకు గ్రీన్ సిగ్నల్.. కానీ గడువు గందరగోళం

న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ): తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సాధారణ బదిలీలకు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ప్రభుత్వ పరంగా బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలించడంతో 2025–2026 సంవత్సరానికి గాను రాష్ట్ర, జోనల్ క్యాడర్ ఉద్యోగుల బదిలీ ప్రక్రియకు టీజీ జెన్‌కో శ్రీకారం చుట్టింది. ఇంజినీరింగ్, అకౌంట్స్ సర్వీసెస్‌కు చెందిన ఉద్యోగుల సాధారణ బదిలీలకు సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలను యాజమాన్యం విడుదల చేసింది. ఈ బదిలీల ప్రక్రియ 2025 డిసెంబర్ 23 నుంచి 2026 జనవరి 31 వరకు అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

కార్పొరేట్ ఆఫీస్‌లో పదేళ్లు దాటితే బదిలీ తప్పదు..

2025 మార్చి 31 నాటికి కార్పొరేట్ కార్యాలయంలో కనీసం 10 ఏళ్ల సేవ పూర్తి చేసిన ఉద్యోగులకు తప్పనిసరిగా బదిలీలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. అదే సమయంలో పవర్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తూ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ కోరుకునే ఉద్యోగులు కనీసం 15 ఏళ్ల సేవ పూర్తి చేసి ఉండాలని నిబంధనగా పేర్కొంది. గతంలో బదిలీ పొందిన ఉద్యోగులు కనీసం నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసిన తర్వాతే మరోసారి బదిలీకి అర్హులవుతారని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఉద్యోగులు జీహెచ్‌ఎంసీ లేదా ఇతర ప్రభుత్వ సంస్థల్లో డెప్యుటేషన్‌పై పనిచేసిన కాలాన్ని 'స్టేషన్ సర్వీస్'గా పరిగణిస్తారు. కానీ, హైదరాబాద్ పరిధిలోని ఇతర సంస్థల్లో డెప్యుటేషన్‌పై పనిచేసి ఉంటే మాత్రం అది కార్పొరేట్ ఆఫీస్ సర్వీస్ కిందకే వస్తుంది.

## తమిళనాడు అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్..

# 13 కారణాలతో లోక్ భవన్ ప్రెస్ నోట్




న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ): తమిళనాడు అసెంబ్లీ సమావేశాల్లో మొదటి రోజు గందరగోళ వాతావరణం నెలకొంది. అసెంబ్లీ ప్రారంభంలో వందేమాతరం పాడటానికి డీఎంకే ప్రభుత్వం ఇష్టపడకపోవడంతో గవర్నర్ ఆర్.ఎన్. రవి ప్రసంగించకుండానే వెనుదిరిగారు. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. ముఖ్యంగా గవర్నర్ మాట్లాడుతుండగా అధికార డీఎంకే సభ్యులు పెద్ద ఎత్తున నిరసనలు చేయడం, పదే పదే గవర్నర్ మైక్ కట్ చేయడంతో ఆయన సభ నుంచి వెళ్లిపోయినట్లు వార్తలు వచ్చాయి అనంతరం గవర్నర్ అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయడానికి 13 ప్రధాన కారణాలను వివరిస్తూ లోక్ భవన్ అధికారికంగా ప్రెస్ రిలీజ్ విడుదల చేసింది. ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రసంగంలో అనేక అవాస్తవాలు ఉన్నాయని, ప్రజలను వేధిస్తున్న కీలక సమస్యలను ప్రభుత్వం కావాలనే విస్మరించిందని గవర్నర్ ఆరోపించారు. ముఖ్యంగా తన మైక్‌ను పదేపదే స్విచ్ ఆఫ్ చేయడం, మాట్లాడనీయకుండా అడ్డుకోవడం పట్ల ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక విఫలాలను గవర్నర్ తన నివేదికలో ఎండగట్టారు. రాష్ట్రంలో మహిళా భద్రతను పూర్తిగా గాలికొదిలేశారని, పోక్సో అత్యాచార కేసులు 55 శాతం, లైంగిక వేధింపుల కేసులు 33 శాతం పెరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు.

# కవితతో కలిసి పని చేయబోతున్నట్లు వస్తున్న వార్తలపై స్పందించిన ప్రశాంత్ కిషోర్




న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ): మాజీ ఎంపీ జాగృతి అధ్యక్షురాలు కవిత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన తర్వాత.. కొత్త రాజకీయ పార్టీ పెట్టున్నట్లు తెలంగాణ శాసన మండలిలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ పొలిటికల్ పార్టీ కోసం కవిత, రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తో కలిసి పని చేయనున్నట్లు అనేక వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఏర్పాటు చేయబోయే కొత్త రాజకీయ పార్టీకి తాను వ్యూహకర్తగా వ్యవహరించబోతున్నట్లు వస్తున్న వార్తలను ప్రశాంత్ కిషోర్ తీవ్రంగా ఖండించారు. గత కొన్ని రోజులుగా మీడియాలో, సోషల్ మీడియాలో కవితతో తాను రెండు సార్లు భేటీ అయ్యానని, తెలంగాణలో కొత్త పార్టీ ఏర్పాటుపై చర్చలు జరిగాయని వస్తున్న కథనాలు కేవలం పుకార్లేనని ఆయన స్పష్టం చేశారు

ఈ లీకులు పూర్తిగా అవాస్తవమని, తనపై వస్తున్న వార్తల్లో ఎటువంటి నిజం లేదని పీకే తేల్చి చెప్పారు. తెలంగాణలో మరో కొత్త రాజకీయ పార్టీకి అవకాశం ఉందని తాను అన్నట్లుగా జరుగుతున్న ప్రచారాన్ని కూడా ఆయన తోసిపుచ్చారు. కవిత తో కలిసి పని చేయబోతున్నట్లు వస్తున్న వార్తలు కేవలం ఊహాగానాలేనని, తన రాజకీయ ప్రయాణం, వ్యూహాలకు సంబంధించి ఎటువంటి నిర్ణయం తీసుకున్నా తానే స్వయంగా వెల్లడిస్తానని పేర్కొన్నారు. ఈ వివరణతో గత కొద్ది రోజులుగా తెలంగాణ రాజకీయాల్లో కవిత కొత్త పార్టీ, పీకే వ్యూహాలపై జరుగుతున్న చర్చకు ప్రస్తుతానికి తెరపడినట్లయింది.

## భారీగా తగ్గుతున్న చైనా జనాభా.. అనుకూలమా? ప్రతికూలమా?




న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం): ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక శక్తుల్లో ఒకటైన చైనా ప్రస్తుతం తీవ్రమైన జనాభా సమస్యను ఎదుర్కొంటోంది. చైనా ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం.. 2025 సంవత్సరం చివరికి చైనా మొత్తం జనాభా 140.4 కోట్లకు (1.404 బిలియన్) చేరుకుంది. ఇది 2024తో పోలిస్తే సుమారు 30 లక్షలు తగ్గినట్టు స్పష్టం చేస్తోంది. వరుసగా నాలుగో సంవత్సరం కూడా చైనాలో జనాభా తగ్గుదల నమోదు కావడం గమనార్హం.

జననాల కంటే మరణాలు ఎక్కువ: 2025లో చైనాలో జననాల సంఖ్య కేవలం 79.2 లక్షలుగానే నమోదైంది. ఇది గత ఏడాదితో పోలిస్తే దాదాపు 17 శాతం తక్కువ. ప్రతి వెయ్యి మందికి జనన రేటు 5.63కి పడిపోయింది. ఇది 1949 తర్వాత చైనాలో నమోదైన అతి తక్కువ స్థాయి. అదే సమయంలో మరణాల సంఖ్య 11.31 మిలియన్లకు చేరింది.దీంతో ప్రతి వెయ్యి మందికి మరణ రేటు 8.04కి పెరిగింది. జననాల కంటే మరణాలు ఎక్కువగా ఉండటం వల్లే జనాభా తగ్గుతోంది.




# గూడ్స్ వాహనదారులకు భారీ రిలీఫ్

## ఆ పన్ను విధానానికి స్వస్తి

- గూడ్స్ వాహనదారులకు భారీ ఊరటనిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం
- త్రైమాసిక పన్ను విధానానికి స్వస్తి పలికిన రవాణా శాఖ
- లైఫ్ ట్యాక్స్ విధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం
- కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకే కొత్త నిబంధనలు
- వాహనం ధరపై 7.5 శాతం లైఫ్ ట్యాక్స్ వసూలు
- పన్ను ఎగవేతను అరికట్టేలా కీలక నిర్ణయం
- ఆర్టీఏ తనిఖీల భారం తగ్గి వాహనదారులకు ఊరట
- రవాణా శాఖ ఆదాయం మరింత పెరిగే అవకాశాలు

మిగతా 2 లో

**న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ):**

గూడ్స్ వాహనదారులకు ఊరటనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. రవాణా రంగంలో ఏళ్లుగా ఇబ్బందికరంగా మారిన త్రైమాసిక పన్ను విధానానికి మంగళం పాడాలని రవాణా శాఖ నిర్ణయించింది. ఇకపై కొత్తగా కొనుగోలు చేసే గూడ్స్ రవాణా వాహనాలకు ప్రతీ మూడు నెలలకోసారి పన్ను కట్టాల్సిన పనిలేదు. దీనికి బదులుగా వాహనం కొనుగోలు సమయంలోనే ఒకేసారి లైఫ్ ట్యాక్స్ (జీవితకాల పన్ను) వసూలు చేసే సరికొత్త విధానాన్ని త్వరలోనే అమల్లోకి తీసుకురానున్నారు. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అసెంబ్లీ సమావేశాల్లో కీలక ప్రకటన చేయగా.. వాహనం ధరలో 7.5 శాతాన్ని లైఫ్ ట్యాక్స్ రూపంలో వసూలు చేసేందుకు రంగం సిద్ధం అవుతున్నది.

## భారత ఈవీ పథకాలపై చైనా అక్కసు




న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ): మరోసారి భారత్‌తో చైనా తగువుకు దిగింది. ముఖ్యంగా మన దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) తయారీ, వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో తీసుకొచ్చిన పథకాలపై చైనా అక్కసు వెళ్లగక్కుతోంది. ద్వైపాక్షిక సంప్రదింపులు విఫలమైన తర్వాత, ఆటోమొబైల్స్, బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాల కోసం భారత ప్రభుత్వం అందించే ప్రోత్సాహక పథకాలకు వ్యతిరేకంగా

## ఆర్ఎస్ఎస్ టెర్రరిస్ట్ సంస్థనా ?


### ఐక్యరాజ్యసమితి రిపోర్ట్ ఏం చెప్తోంది?




న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ): ఆర్ఎస్ఎస్ టెర్రరిస్ట్ సంస్థనా ? దేశంలో కాషాయ భావజాలం పెరిగిందన్న ప్రతీసారి దీనిపై చర్చ జరుగుతోంది. అలాగే ఉగ్రవాదానికి మతం లేదని, సమాజంలో నెలకొనే పరిస్థితుల ఆధారంగానే కొందరు ఉగ్రవాదులుగా మారుతున్నారన్న వాదన కూడా ఉంది. మనం ఎంతోకాలంగా వింటూ వస్తోన్న ఈ రెండు విషయాల్లో వాస్తవమెంత? ఉగ్రవాదంపై ఇటీవల ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన నివేదిక ఇందుకు సమాధానంగా కనిపిస్తోంది.

# తమిళనాడు అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్.. 13 కారణాలతో లోక్ భవన్ ప్రెస్ నోట్

మొదటి పేజీ తరువాయి


PRESS RELEASE NO. 03 DATE: 20.01.2026

LOK BHAVAN, TAMIL NADU
PRESS RELEASE ON GOVERNOR'S ADDRESS AT TAMIL NADU LEGISLATIVE ASSEMBLY HELD TODAY (20.01.2026)

Reasons why Governor declined reading the Govt speech in the Assembly:

1- Governor's Mike was repeatedly switched off and he was not allowed to speak;

2- The speech contains numerous unsubstantiated claims and misleading statements. Several crucial issues troubling the people are ignored;

3- Claim that the state attracted huge investments to the tune of over 12 lakh crores is far from the truth. Many of the MOUs with prospective investors remain only on paper. Actual investment is hardly a fraction of it. Investment data show that Tamil Nadu is becoming less attractive for investors. Until four years ago Tamil Nadu, among the states, was the fourth largest recipient of foreign direct investment. Today it is struggling to remain at the Sixth.

4- Women safety issue is totally ignored though there is alarming increase of over 55% incidents of POCSO Rapes and over 33% increase in incidents of sexual molestation of women;

అలాగే, మాదకద్రవ్యాల వినియోగం వల్ల ఏడాదికి సుమారు 2000 మంది యువకులు ఆత్మహత్య చేసుకుంటున్నారని, దీనిపై ప్రభుత్వం మౌనంగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో ఏడాదికి 20,000 ఆత్మహత్యలు జరుగుతున్నాయని, రోజుకు సగటున 65 మంది బలవన్మరణానికి పాల్పడుతుండటంతో తమిళనాడు 'భారతదేశ ఆత్మహత్యల రాజధాని'గా మారుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యా వ్యవస్థలో ప్రమాణాలు పడిపోవడంతో పాటు 50 శాతానికి పైగా ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇది యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని గవర్నర్ విమర్శించారు. పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం, వేలాది దేవాలయాలను బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు లేకుండా ప్రభుత్వమే నేరుగా నిర్వహించడం భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని పేర్కొన్నారు. 12 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్న ప్రభుత్వ వాదన కేవలం కాగితాలకే పరిమితమని, గతంలో నాలుగో స్థానంలో ఉన్న తమిళనాడు ఇప్పుడు ఆరో స్థానానికి పడిపోయిందని ఎద్దేవా చేశారు. వీటన్నింటికీ తోడు జాతీయ గీతాన్ని మరోసారి అవమానించడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేస్తూ, అందుకే తాను ప్రసంగించలేదని గవర్నర్ వివరణ ఇచ్చారు.

# గూడ్స్ వాహనదారులకు భారీ రిలీఫ్.. ఆ పన్ను విధానానికి స్వస్తి

మొదటి పేజీ తరువాయి

**పన్ను ఎగవేతకు చెక్.. ఖజానాకు కిక్:** ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం గూడ్స్ వాహనాలు ప్రతీ మూడు నెలలకు ఒకసారి రవాణా శాఖకు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. రవాణా శాఖ గణాంకాల ప్రకారం దాదాపు 25 శాతం మంది వాహన యజమానులు సకాలంలో ఈ పన్ను చెల్లించడం లేదు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుండటమే కాకుండా, పన్ను కట్టని వాహనాలను పట్టుకోవడానికి రవాణా శాఖ అధికారులు రోడ్లపై నిరంతరం తనిఖీలు చేయాల్సి వస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రతిపాదించిన లైఫ్ ట్యాక్స్ విధానం ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి ఉపయుక్తంగా మారనుంది. కొత్త విధానం ప్రకారం, వాహనం కొన్నప్పుడే 7.5% లైఫ్ ట్యాక్స్ చెల్లిస్తేనే రిజిస్ట్రేషన్ జరుగుతుంది. దీనివల్ల వందశాతం పన్ను వసూలవుతుంది. ఒకసారి లైఫ్ ట్యాక్స్ కట్టిన వాహనాన్ని పన్ను కోసం అధికారులు ఆపాల్సిన పనిలేదు. అటు అధికారులు, ఇటు వాహనదారులకు సమయం ఆదా అవుతుంది.

వాహనదారునికి లాభమా? నష్టమా?: సాధారణంగా గూడ్స్ వాహనాలకు పదేళ్ల కాలపరిమితి ఉంటుంది. ఆ తర్వాత ఫిట్‌నెస్ ఆధారంగా మరో మూడేళ్లు, ఆపై మరో రెండేళ్లు (మొత్తం సుమారు 15 ఏళ్లు) అనుమతి ఇస్తారు. ఆ తర్వాత వాహనాన్ని స్క్రాప్ (తుక్కు) కింద మార్చాల్సిందే. పదిహేనేళ్లపాటు ప్రతీ మూడు నెలలకు ఒకసారి పన్ను కట్టడం, మధ్యలో మర్చిపోతే పెనాల్టీలు కట్టడం వాహనదారులకు భారంగా మారుతున్నది. దీనికి బదులుగా ఆరంభంలోనే 7.5శాతం పన్ను కట్టడం వల్ల దీర్ఘకాలంలో యజమానులకు ఆర్థిక భారం తగ్గుతుంది. ప్రతి మూడు నెలలకోసారి ఆర్టీఏ ఆఫీసుల చుట్టూ తిరిగే పని కూడా తప్పుతుంది. ట్యాక్స్ చెల్లించకుండా ఆర్టీఏ అధికారులను తప్పించుకుని తిరిగే అవసరం ఉండబోదు.

**పాత వాహనాలకు వర్తించదు..:** ఈ కొత్త విధానం కేవలం షోరూమ్ నుంచి కొత్తగా కొనుగోలు చేసే గూడ్స్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. ఇప్పటికే రోడ్లపై తిరుగుతున్న (పాత) వాహనాలు మాత్రం యథావిధిగా పాత పద్ధతిలోనే త్రైమాసిక పన్ను చెల్లించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం గూడ్స్ వాహనాల నుంచి రవాణా శాఖకు భారీ ఆదాయం వస్తున్నది. అయితే కొత్త విధానం వల్ల ప్రభుత్వానికి, వాహనదారులకు మధ్య జరిగే లావాదేవీల తీరు మారనుంది.

**ప్రస్తుతం.. త్రైమాసిక పన్ను రేట్లు..:** ప్రస్తుతం వాహనం మోసే బరువును బట్టి పన్ను వసూలు చేస్తున్నారు. చిన్న గూడ్స్ వాహనాలు (3000 కేజీల లోపు) త్రైమాసికానికి సుమారు రూ. 1800 – రూ. 2500 వరకు, మధ్య రకం వాహనాలు (3000 – 7500 కేజీలు) త్రైమాసికానికి సుమారు రూ. 3500 – రూ. 5000 వరకు, భారీ వాహనాలకు త్రైమాసికానికి రూ. 6000 పైన వసూలు చేస్తున్నారు. రాష్ట్ర రవాణా శాఖకు ఏటా సుమారు రూ. ఆరు వేల కోట్ల నుంచి రూ.ఏడు వేల కోట్ల వరకు ఆదాయం వస్తున్నది. ఇందులో గూడ్స్ వాహనాల వాటానే ఎక్కువ. కొత్తగా వచ్చే లైఫ్ ట్యాక్స్ విధానం వల్ల... మొదట్లో ప్రభుత్వానికి ఒకేసారి భారీ మొత్తం సమకూరుతుంది. కానీ, దీర్ఘకాలంలో ప్రతి మూడు నెలలకు వచ్చే ఆదాయం మాత్రం ఆగిపోతుంది. అయినా ఎగవేతలను అరికట్టడం ద్వారా ఆ లోటును భర్తీ చేయవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది.

**మరింతగా పెరగనున్న లైఫ్ ట్యాక్స్..:** 2025–26లో ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు రూ.6,165 కోట్ల ఆదాయాన్ని రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకోగా, రూ.5,142 కోట్లు వసూలైంది. ఇందులో వివిధ రకాల వాహనాలకు జీవిత కాల పన్నుల ద్వారా రూ.3,611 కోట్లు వచ్చింది. అంటే లైఫ్ ట్యాక్స్ తోనే 70.2 శాతం ఆదాయం సమకూరింది. గూడ్స్ వెహికల్స్ కు సైతం లైఫ్ ట్యాక్స్ తీసుకువచ్చిన తర్వాత.. రవాణా శాఖకు వసూలు అయ్యే లైఫ్ ట్యాక్స్ భారీగా పెరిగే అవకాశముంది.

## టీజీ జెన్‌కో బదిలీలకు గ్రీన్ సిగ్నల్.. కానీ గడువు గందరగోళం

మొదటి పేజీ తరువాయి

ఇక ఎలక్ట్రికల్, మెకానికల్, టెలికాం, కంప్యూటర్స్ విభాగాలను కలిపి ఒకే స్ట్రీమ్‌గా, సివిల్ విభాగాన్ని ప్రత్యేక స్ట్రీమ్‌గా పరిగణించి బదిలీలు చేపట్టనున్నారు.

ఖాళీల కేటాయింపులో ప్రత్యేక ప్రాధాన్యతలు..

బదిలీల కేటాయింపులో మొత్తం ఖాళీల్లో 25 శాతం వైద్య కారణాలపై, మరో 25 శాతం భార్య లేదా భర్త ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్న స్పౌజ్ కేసులకు, మిగిలిన 50 శాతం వ్యక్తిగత కారణాల ఆధారంగా కేటాయిస్తామని యాజమాన్యం వెల్లడించింది. అయితే శాఖాపరమైన విచారణలు, క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యత ఉండదని స్పష్టం చేసింది. వ్యక్తిగత, వైద్య, భార్యాభర్తల ఉద్యోగ సంబంధిత దరఖాస్తులను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈ ఉత్తర్వుల నేపథ్యంలో 2026–2027 సంవత్సరంలో ఎలాంటి సాధారణ బదిలీలు ఉండవని టీజీ జెన్‌కో యాజమాన్యం స్పష్టం చేయడం గమనార్హం. దీని వల్ల ఈసారి జరిగే బదిలీలే వచ్చే ఏడాదికి కీలకంగా మారనున్నాయి.

పాత తేదీలతో ఉత్తర్వులు.. కొత్త చిక్కులు

బదిలీల ప్రక్రియ 2025 డిసెంబర్ 23 నుంచి 2026 జనవరి 31 వరకు అమల్లో ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. కానీ, మార్గదర్శకాలు మాత్రం జనవరి 19న విడుదలయ్యాయి. అంటే దాదాపు నెల రోజులు గడిచిపోయాక ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో జనవరి 31 లోపు ప్రక్రియ పూర్తి చేయాలంటే అధికారుల చేతిలో కేవలం 10 రోజుల సమయం మాత్రమే ఉంది. సాధారణంగా బదిలీల ప్రక్రియలో అభ్యంతరాల స్వీకరణ, సీనియారిటీ జాబితాల పరిశీలన, ఆప్షన్ల ఎంపికకు తగిన సమయం అవసరం. ఇప్పుడు గడువు తక్కువగా ఉండటంతో ప్రక్రియను మమ అనిపించే ప్రమాదం ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత తక్కువ సమయంలో దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించడం సాధ్యమేనా? హడావుడిగా ప్రక్రియ ముగించడం వల్ల అర్హులైన వారికి అన్యాయం జరిగే ఆస్కారం లేదా? కొందరికి లబ్ధి చేకూర్చేందుకే ఇలా సమయం లేకుండా చేశారా? అనే అనుమానాలు ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నాయి.

# భారీగా తగ్గుతున్న చైనా జనాభా.. అనుకూలమా? ప్రతికూలమా?

మొదటి పేజీ తరువాయి

కొంపముంచిన 'వన్ చైల్డ్ పాలసీ': నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ పరిస్థితికి ప్రధాన కారణం గతంలో అమలు చేసిన వన్ చైల్డ్ పాలసీ. 1979 నుంచి 2015 వరకు ఒకే సంతానం విధానం అమల్లో ఉండటంతో ఇప్పుడు దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. 2016లో టూ చైల్డ్ పాలసీ, 2021లో థ్రీ చైల్డ్ పాలసీ తీసుకొచ్చినా జననాలు పెరగలేదు. దీనికి తోడు జీవన ఖర్చులు పెరగడం, ఉద్యోగ ఒత్తిడి, యువత పెళ్లిళ్లు ఆలస్యంగా చేసుకోవడం, మహిళలు ఉద్యోగాలపై ఎక్కువ దృష్టి పెట్టడం వంటి సామాజిక మార్పులు కూడా జనన రేటు తగ్గడానికి కారణమవుతున్నాయి. 2025లో వివాహాల సంఖ్య కూడా భారీగా తగ్గినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

జీడీపీ ఢమాల్: ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే చైనాలో సంతానోత్పత్తి రేటు చాలా తక్కువగా ఉంది. దక్షిణ కొరియాలో ఫెర్టిలిటీ రేటు 0.78, జపాన్‌లో 1.26, భారత్‌లో 2.0 ఉండగా, చైనాలో అది 1.09కి పడిపోయింది. నిపుణులు దీనిని "డెమోగ్రాఫిక్ క్రైసిస్"గా అభివర్ణిస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే 2030 నాటికి చైనా జీడీపీ వృద్ధి 3 శాతం వరకే పరిమితమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

పెరుగుతున్న వృద్ధుల జనాభా.. ఆ రంగాలు కుదేలు: చైనా ఎదుర్కొంటున్న మరో పెద్ద సమస్య వృద్ధుల జనాభా పెరుగుదల. 2025 నాటికి చైనాలో 60 ఏళ్లకు పైబడిన వారి సంఖ్య 323 మిలియన్లకు చేరింది. ఇది మొత్తం జనాభాలో సుమారు 23 శాతం. దీనివల్ల పని చేసే యువ జనాభా తగ్గిపోతుంది. కార్మికుల కొరత ఏర్పడి, పరిశ్రమలు, ముఖ్యంగా మాన్యుఫాక్చరింగ్ రంగం దెబ్బతింటుంది. పెన్షన్ వ్యవస్థలపై కూడా తీవ్ర భారం పడనుంది.

ఈ క్రైసిస్ నుంచి బయటపడటం ఎలా?: ఈ సమస్యను ఎదుర్కొనేందుకు చైనా ప్రభుత్వం పన్ను రాయితీలు, పిల్లల సంరక్షణకు సబ్సిడీలు, ఉచిత కిండర్‌గార్టెన్ విద్య వంటి ప్రోత్సాహకాలు ఇస్తోంది. అయినా అవి ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, కేవలం ఆర్థిక ప్రోత్సాహకాలు సరిపోవు. జీవన ఖర్చులు తగ్గించడం, మహిళలకు కుటుంబం-ఉద్యోగం మధ్య సమతుల్యం కల్పించడం, దీర్ఘకాలిక సామాజిక సంస్కరణలు తీసుకురావడం అవసరం.

ప్రపంచంపై ఎఫెక్ట్ ఎంత?: చైనా జనాభా తగ్గుదల దేశ ఆర్థిక వ్యవస్థపై మాత్రమే కాదు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. భారత్ వంటి దేశాలు ఇప్పుడు ప్రపంచంలో అతిపెద్ద జనాభా కలిగి.. ప్రపంచ కొత్త ఆర్థిక శక్తిగా ఎదుగుతోంది. ఈ క్రమంలో చైనా తన ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవాలంటే కొత్త వ్యూహాలతో ముందుకు రావాల్సిన అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. అప్పుడే చైనా ఈ డెమోగ్రాఫిక్ క్రైసిస్‌ను అధిగమించగలదు.

# అక్షయ్ కుమార్ వాహనానికి ప్రమాదం

న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ): బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ వాహనానికి సోమవారం రాత్రి భారీ ప్రమాదం జరిగింది. అక్షయ్ కుమార్, ఆయన భార్య ట్వింకిల్ ఖన్నా విదేశీ పర్యటన నుంచి తిరిగి వస్తుండగా... కాన్వాయ్‌లోని ఒక ఎస్కార్ట్ వాహనానికి ముంబై జుహూ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన ఒక మెర్సిడెస్ కారు ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఆ ఆటో అదుపు తప్పి రోడ్డుకు అవతలివైపు ప్రయాణిస్తున్న అక్షయ్ ఎస్కార్ట్ కారును ఢీకొనడంతో, ఆ వాహనం రోడ్డుపై పల్టీ కొట్టింది.ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా దెబ్బతినగా, ఆటో డ్రైవర్‌తో పాటు ఒక ప్రయాణికుడికి గాయాలయ్యాయి. వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. అక్షయ్, ట్వింకిల్ ప్రయాణిస్తున్న మరో వాహనంకు కూడా స్వల్పంగా దెబ్బ తగిలినప్పటికీ.. వారిద్దరూ సురక్షితంగా ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. కాగా అక్షయ్ కుటుంబం సురక్షితంగా ఉండటంతో ఆయన అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

# భారత ఈవీ పథకాలపై చైనా అక్కసు

మొదటి పేజీ తరువాయి

వివాద పరిష్కార ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలని ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ)ను కోరడం ద్వారా చైనా భారత్‌తో తన వాణిజ్య వివాదాన్ని మరింత పెంచుకునే దిశగా అడుగులు వేసింది. 2025, నవంబర్ 25, 2026, జనవరి 6న జరిగిన సంప్రదింపుల్లో ఎలాంటి నిర్ణయం ఖరారు కాలేదని, ఫలితంగా ఒక ప్యానెల్ ఏర్పాటు చేయాలని కోరినట్లు ప్రపంచ వాణిజ్య సంస్థకు పంపిన ఓ ప్రకటనలో చైనా తెలిపింది. దీనిపై జనవరి 27న జెనీవాలో జరిగే తదుపరి డబ్ల్యూటీఓ సమావేశంలో చర్చ ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రధానంగా, ఈ వివాదం భారత ప్రభుత్వం తెచ్చిన ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక(పీఎల్ఐ) పథకం గురించి. ఈ పథకం భారత్‌లో తయారు చేసిన వస్తువులకు అనుకూలంగా ఉన్నాయని, చైనా ఉత్పత్తులు పోటీ పడేందుకు అడ్డంకిగా ఉన్నాయని చైనా చెబుతోంది. ఇది ప్రపంచ వాణిజ్య నియమాల ఉల్లంఘన అని, తమ కంపెనీలపై వివక్ష చూపడమేనని చైనా అంటోంది. భారత విధానాలు సబ్సిడీలు, వాణిజ్యం, పెట్టుబడి నిబంధనలపై డబ్ల్యూటీఓ ఒప్పందాలకు విరుద్ధంగా ఉన్నాయని చైనా వాదిస్తోంది. ఇది పీఎల్ఐ పథకం మాత్రమే కాదు, అధునాతన బ్యాటరీ స్టోరేజ్ పథకం, భారత్‌లో ఈవీల తయారీని ప్రోత్సహించే విధానాలతో సహా అనేక కార్యక్రమాలను చైనా పేర్కొంది.

## మున్సిపల్ ఎన్నికలు.. ఆశావహులతో కవిత కీలక భేటీ



న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ): రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో జాగృతి నేతలు బరిలో దిగుతారని కవిత స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్ లోని తమ నివాసంలో కవిత ఆశావహులతో భేటీ అయ్యారు. ఎన్నికల్లో రచించాల్సిన వ్యూహాలు, ఇతర అంశాలపై కవిత చర్చిస్తున్నారు. కాగా ఈ ఎన్నికల్లో నిజామాబాద్ లో 20 నుండి 30 స్థానాల్లో జాగృతి అభ్యర్థులు బరిలో దిగబోతున్నట్టు తెలుస్తోంది. సింహం గుర్తుపై జాగృతి అభ్యర్థుఉ పోటీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. నోటిఫికేషన్ రాకముందే అభ్యర్థులను ప్రకటించేలా కవిత కసరత్తు చేస్తున్నారు. దీంతో సింహం గుర్తును జాగృతి కార్యకర్తలు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ఇక కవిత తొలిసారిగా సొంతగడ్డపై బరిలో దిగుతుండటంతో జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. ఇంతకుముందు నిజామాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ పార్టీలో పనిచేసిన కవిత ఇప్పుడు సొంతపార్టీతో రావడంతో ఉత్కంఠ నెలకొంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్, నిజామాబాద్ లో మంచి పట్టు ఉన్న బీజేపీ అదే విధంగా తన తండ్రి పార్టీ బీఆర్ఎస్ లను ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరంగా మారింది.

## ఆర్ఎస్ఎస్ టెర్రరిస్ట్ సంస్థనా ? ఐక్యరాజ్యసమితి రిపోర్ట్ ఏం చెప్తోంది?

మొదటి పేజీ తరువాయి

ఆర్ఎస్ఎస్ అంటే కాషాయ ఉగ్రవాదమా?: ఐక్యరాజ్యసమితి అధికారిక వెబ్‌సైట్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉగ్రవాదుల సంఖ్య, వారిలో ఏయే మతస్తులు ఎంతమంది ఉన్నారో తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా 726 మంది ఉగ్రవాదులు, 273 ఉగ్రవాద సంస్థలు, గ్రూపులు ఉన్నట్లు పేర్కొంది. ఈ లిస్టు ప్రకారం.. యూఎన్ ప్రకటించిన 726 మంది ఉగ్రవాదుల్లో 702 మంది ముస్లింలు, 13 మంది క్రైస్తవులు, 11 మంది వామపక్ష భావజాలం కలిగిన కొరియన్లు ఉన్నారు. ఈ మొత్తం లిస్టులో ఒక్క హిందువు కానీ, ఆర్ఎస్ఎస్ సంస్థ పేరు కానీ, ఆ సంస్థతో సంబంధం ఉన్న వ్యక్తి పేరు కానీ లేవు. దీనిని బట్టి చూస్తే ఆర్ఎస్ఎస్ ఉగ్రవాద సంస్థ కాదని స్పష్టమవుతోంది. ఆర్ఎస్ఎస్ అంటే హిందూ టెర్రరిజం అని, కాషాయ ఉగ్రవాదమని ప్రచారం చేసేవారు ఈ విషయం గురించి ఆలోచించాలి. ప్రపంచం గురించి ప్రతి విషయాన్ని పరిశీలించే ఐక్యరాజ్యసమితి వెలువరించిన ఉగ్రవాదుల లిస్టులో ఆర్ఎస్ఎస్ పేరు లేదంటే.. అది ఉగ్రవాద సంస్థ కాదనే కదా అర్థం.

# విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. విద్యార్థి మృతి

న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ): కరెంట్ షాక్‌తో విద్యార్థి మృతి చెందిన ఘటన నాగర్ కర్నూల్ జిల్లా తాడూర్ మండలం ఇంద్రకల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం చోటుచేసుకుంది. విద్యార్థి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రకల్ గ్రామానికి చెందిన మల్లేష్, లక్ష్మమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు.9వ తరగతి చదువుతున్న పెద్ద కుమారుడు లోకేష్(14) రోజులాగే పాఠశాలకు చేరుకుని పాఠశాలలో ఆటల పోటీలు ఉన్నాయని బయట ఆడుకుంటూ ఉండగా ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం వద్ద ఉన్న విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే కుప్పకూలాడు. అది గమనించిన తోటి విద్యార్థులు ఉపాధ్యాయులను పిలిపించి విద్యార్థిని జిల్లా ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రులు జిల్లా ఆసుపత్రికి చేరుకొని కన్నీరు మున్నీరు గా విలపిస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం సంభవించినట్లు గ్రామస్తులు ఆరోపించారు.

# అభద్రతా భావంలో కేరళ పురుషులు



న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ): కేరళలోని చోటు చేసుకున్న ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కోజికోడ్‌కు చెందిన దీపక్ అనే వ్యక్తి, బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో తనను అసభ్యంగా తాకాడని ఒక మహిళ తీసిన వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఆ వీడియో వైరల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జనవరి 16న పయ్యన్నూర్ వెళ్లే బస్సులో ఈ ఘటన జరిగిందని సదరు మహిళ వీడియో పోస్ట్ చేయగా, అది లక్షలాది మందికి చేరింది. అయితే, ఆ ఆరోపణలు అబద్ధమని దీపక్ కుటుంబ సభ్యులు వాదిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో జరిగిన ఈ "డిజిటల్ ట్రయల్" కారణంగానే దీపక్ బలవన్మరణానికి పాల్పడ్డాడనే ఆగ్రహం రాష్ట్రవ్యాప్తంగా వ్యక్తమవుతోంది.

ఈ ఘటన అనంతరం కేరళలోని పురుషుల్లో తీవ్ర అభద్రతా భావం మొదలైంది. ఏ చిన్న పొరపాటు జరిగినా వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టే సంస్కృతి పెరిగిపోయిందని, పురుషులు బస్సుల్లో ప్రయాణించాలంటే భయపడాల్సిన పరిస్థితి వచ్చిందని నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగానే కొందరు పురుషులు అట్టా పెట్టెలను తమ శరీరానికి కట్టుకుని బస్సుల్లో, బస్టాండ్లలో నిలబడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "ఎవరికీ తాకకుండా ఉండేందుకు, ఏ ఆరోపణలు రాకుండా ఉండేందుకు ఇలా చేస్తున్నాం" అంటూ వ్యంగ్యంగా నిరసన తెలుపుతున్న ఈ దృశ్యాలు చర్చనీయాంశంగా మారాయి. ఇది కేవలం నిరసన మాత్రమే కాకుండా, పురుషుల భద్రత, సామాజిక మాధ్యమాల దుర్వినియోగంపై జరుగుతున్న ఒక నిశిత విమర్శ గా కనిపిస్తోంది.

## బీజేపీ నూతన అధ్యక్షుడిగా నితిన్ నబీన్.. ఘనంగా సత్కరించిన ప్రధాని మోదీ



న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ): భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నితిన్ నబీన్‌కు పార్టీ ప్రధాన కార్యాలయంలో ఘన స్వాగతం లభించింది. సోమవారం జరిగిన నామినేషన్ల తర్వాత ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధిష్ఠానం ప్రకటించింది. ఈ క్రమంలో నేడు ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్వయంగా పాల్గొని నితిన్ నబీన్‌ను సత్కరించారు. ప్రస్తుతం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయన, ఇప్పుడు పూర్తి స్థాయి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయం పండుగ వాతావరణాన్ని తలపించింది.

అగ్రనేతల సమక్షంలో నబీన్ బాధ్యతల స్వీకారం: ఈ వేడుకలో ప్రధాని మోడీతో పాటు పార్టీ మాజీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ తదితర అగ్రనేతలు పాల్గొని నూతన అధ్యక్షుడిని అభినందించారు. జాతీయ ఎన్నికల అధికారి కె. లక్ష్మణ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఎన్నిక ప్రక్రియ అంతా నిబంధనల ప్రకారమే సాగింది. దేశవ్యాప్తంగా ఉన్న 36 రాష్ట్ర యూనిట్లలో 30 మంది రాష్ట్ర అధ్యక్షులు ఎన్నికైన తర్వాతే జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ మొదలైంది.

ఏకగ్రీవంగా ఎన్నిక: నితిన్ నబీన్ పేరును ప్రతిపాదిస్తూ మొత్తం 37 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలయ్యాయి. ప్రధాని మోడీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ వంటి అగ్రనేతలే ఆయన పేరును ప్రతిపాదించడం విశేషం. జనవరి 19న మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య జరిగిన నామినేషన్ల ప్రక్రియలో నితిన్ నబీన్ తప్ప మరెవరూ పోటీలో లేకపోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. పార్టీలో 'సంగఠన్ పర్వ్' పేరుతో జరిగిన ఈ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ద్వారా నూతన సారథిని ఎంచుకున్నారు. ఢిల్లీ వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి అన్ని రాష్ట్రాల బీజేపీ ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, కీలక నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సహా సీనియర్ నేతలు హాజరయ్యారు.

# శబరిమల బంగారం చోరీ కేసు.. 3 రాష్ట్రాల్లో ఈడీ సోదాలు

న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ): శబరిమల బంగారం చోరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మూడు రాష్ట్రాల్లో ఏకకాలంలో 21 ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెల్లడించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేరళ, కర్ణాటక, తమిళనాడు అంతా దాదాపు 21 ప్రదేశాల్లో దాడులు నిర్వహిస్తున్నట్లు వివరించింది. ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావెన్ కోర్ దేవస్వం బోర్డు మాజీ అధ్యక్షుడు పద్మకుమార్ కు సంబంధించిన స్థలాలను ఇందులో భాగంగా ఫెడరల్ దర్యాప్తు సంస్థ కవర్ చేసినట్లు సమాచారం.

రాజకీయంగా సున్నితమైన ఈ కేసును కేరళ హైకోర్టు పర్యవేక్షణలో రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దర్యాప్తు చేస్తోంది. ఈ దర్యాప్తు అధికారుల దుష్ప్రవర్తన, పరిపాలనా లోపాలు, అయ్యప్ప ఆలయంలోని వివిధ కళాఖండాల నుండి బంగారాన్ని సేకరించి దుర్వినియోగం చేయడానికి జరిగిన నేరపూరిత కుట్రతో సహా వరుస అవకతవకలకు పాల్పడినట్లు అభియోగాలు నమోదయ్యాయి.

## నోబెల్ బహుమతిపై ట్రంప్ సంచలన నిర్ణయం

న్యూస్ డెస్క్, 20 జనవరి (ఇది కద నిజం ): నోబెల్ బహుమతి పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. నోబెల్ బహుమతి తనకు లెక్క కాదని ప్రకటించారు. ఇకనుంచి నోబెల్ గురించి పట్టించుకోను, అవసరం కూడా లేదు అనే రీతిలో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా లక్షల మందిని కాపాడిన చరిత్ర తనదని పేర్కొన్నారు. అలాంటి తనకు నోబెల్ ఇవ్వకుండా అడ్డుకున్నారని అన్నారు. దీనికి తోడు తాజాగా ఆయన నార్వే ప్రధాని జోనాస్ గార్ స్టోర్‌కు రాసిన లేఖలోనూ నోబెల్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 8 యుద్ధాలు ఆపాను. అయినా కూడా నాకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వలేదు. దాంతో ఇక శాంతి కోసమే ఆలోచించకూడదని నిర్ణయించుకున్నా. ఇప్పటికీ నాకు శాంతి ముఖ్యమే. కానీ ముందు అమెరికాకు ఏది మంచిదో, ముఖ్యమో అదే చేయడంపై ఫోకస్ పెడతా అని తన లేఖలో ట్రంప్ పేర్కొన్నారు. గ్రీన్‌లాండ్ విషయంలో వెనక్కి తగ్గేది లేదని అన్నారు. నా నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న ఐరోపా దేశాలపై అదనపు సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించారు.

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ఇది కద నిజం, యాదాద్రి:కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా... మెప్మా ఆధ్వర్యంలో వడ్డీ లేని రుణాలు యాదగిరిగుట్ట లోని శ్రీ లక్ష్మి నరసింహా ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య , జిల్లా కలెక్టర్ హనుమంత రావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన గావించి యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో గల స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.98,23,458 లక్షల రూపాయలు వడ్డీ లేని రుణాల చెక్కును అందజేశారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టామన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని ప్రవేశ పెట్టిందని రాష్ట్రంలో 265 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణం చేసినట్లు అందుకు గాను ప్రభుత్వం 10 వేల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. ధనిక కుటుంబ సభ్యులు ఏ బియ్యం అయితే తింటున్నారో అవే సన్న బియ్యం ప్రతి పేద ప్రజలు కడుపు నిండా అన్నం తినాలనే లక్ష్యంతో మనిషికి ఆరు కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నామని అన్నారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో అర్హులైన 16,152 మందికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో మహిళలు ఆర్థికంగా , బలోపేతం చేయడం కోసం పెట్రోల్ బంకులు కూడా మహిళల పేరున ఇస్తున్నామన్నారు. ప్రతి పేద వారు సొంత ఇంట్లో ఉండాలనే గొప్ప లక్ష్యంతో ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. యాదగిరిగుట్ట తో పాటు యాదగిరిగుట్ట టౌన్ కూడా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అందుకోసం 100 కోట్లతో యాదగిరిగుట్టలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు త్వరలో చేపట్టడం జరుగుతుందన్నారు. కొత్తగా స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. యాదగిరిగుట్టలో 210 కోట్ల వ్యయ తో చేపట్టిన పైప్ లైన్ పనులు త్వరలో పూర్తి కావొస్తున్నందున ప్రతి ఇంటికి గోదారి జలాలు అందుతాయన్నారు. గంధమల్ల రిజర్వాయర్ ప్రాజెక్ట్ పూర్తి అయితే పరిసర ప్రాంతాలకు , రైతులకు లక్ష ఎకరాలకు సాగు నీరు అందించడం జరుగుతుందని తెలిపారు.



ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ...మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రజాపాలన ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని, అందులో భాగంగానే వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందన్నారు.ప్రతి ఆడ బిడ్డకు పుట్టింటి సారెగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాల నుండి 100 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి మహిళలకు ఇందిరమ్మ చీరలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. త్వరలో ఇళ్లు లేని నిరు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని, అభివృద్ధి పథంలో యాదగిరిగుట్టను ముందంజలో ఉండాలన్నారు. అనంతరం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం కు గాను వివిధ బ్యాంకులు మరియు శ్రీనిధి వారి సహకారంతో 87 సంఘాలకు రూ.12,73,00,000 బ్యాంకు లింకేజి చెక్కును స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ఇది కద నిజం: ఆలేరు నియోజకవర్గం పరిధిలోని యాదగిరిగుట్ట పట్టణం, మోటకొండూరు, ఆలేరు పట్టణాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి , తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం యాదగిరిగుట్టకు విచ్చేశారు.ఈ సందర్భంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా,వారికి లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైదాపురం, మాటూర్ గ్రామాల్లో నూతన విద్యుత్ ఉప కేంద్రాలను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ఇది కద నిజం: యాదగిరిగుట్ట మండలం సైదా పురం గ్రామం లో నూతనంగా నిర్మించనున్న 33/11KV విద్యుత్ ఉప కేంద్రాన్ని, మోటకొండూర్ మండలం మాటూర్ గ్రామం లో నూతనంగా నిర్మించనున్న 33/11KV విద్యుత్ ఉప కేంద్రాన్ని రోడ్లు మరియు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ హనుమంత రావు,మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, ఎలక్ట్రిసిటీ SE సురేష్, CE బాలస్వామి, DE వెంకటేశ్వర్లు తో కలసి మంత్రి నూతన విద్యుత్ ఉప కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు.

# నూతన ఆర్టీఐ కమీషనర్లచే ప్రమాణ స్వీకారం చేయించిన సిఎస్ విజయానంద్



ఇది కద నిజం:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమీషన్ కు నూతనంగా నియమితులైన కమీషనర్లచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈమేరకు మంగళవారం ఎపి సచివాలయంలో నూతన కమీషనర్లతో ప్రమాణం చేయించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమీషన్ కు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ కమీషనర్ సహా ఇతర కమీషనర్లను నియమించడం జరిగింది.రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ వారి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నూతన కమీషనర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు.రాష్ట్ర సమాచార కమీషన్ చీఫ్ కమీషనర్ గా వజ్జా శ్రీనివాసరావుతో ముందుగా సిఎస్ విజయానంద్ ప్రమాణం చేయించారు.తదుపరి పరవాడ సింహాచలం నాయుడు,వంటేరు రవిబాబు,ఆదెన్న గాజుల,చరత్ చంద్ర కళ్యాణ చక్రవర్తి వట్టికూటిచే సమాచార కమీషనర్లుగా ప్రమాణం చేయించారు.ఈసందర్భంగా నూతన కమీషనర్లకు సిఎస్ పుష్పగుచ్ఛాలు అందించి రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలిపారు.

ఈకార్యక్రమంలో రాష్ట్ర సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్,ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ,ఆర్టీఐ అధికారులు,నూతన ఆర్టీఐ కమీషనర్ల కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# కిలేడీల ముఠా గుట్టురట్టు

- ముగ్గురు అంతర్ జిల్లా దొంగల అరెస్ట్
- 8 తులాల బంగారం, 50 తులాల వెండి స్వాధీనం

: వికారాబాద్ ఎస్పీ స్నేహ మెహ్రా




ఇది కద నిజం,వికారాబాద్, జనవరి 20: అమాయక మహిళలనే లక్ష్యంగా చేసుకుని, మాయమాటలతో వారి దృష్టి మరల్చి బంగారం దొంగిలిస్తున్న ముగ్గురు మహిళల అంతర్ జిల్లా ముఠాను వికారాబాద్ జిల్లా సిసిఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, IPS మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. జిల్లాలోని ధారూర్, వికారాబాద్ టౌన్, పరిగి ప్రాంతాల్లో వరుసగా చోటు చేసుకున్న దొంగతనాల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఈ ముఠాను అదుపులోకి తీసుకున్నాయి. ఈ ముఠా ప్రధానంగా ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను టార్గెట్ చేస్తారు. రద్దీగా ఉండే మార్కెట్లు లేదా నిర్మానుష్య ప్రదేశాల్లో నిందితులు నకిలీ బంగారు బిస్కెట్లు లేదా రాడ్లను బాధితుల ముందు పడేసి, తమకు దొరికినట్లు నటిస్తారు. "మాకు బంగారం దొరికింది, దీన్ని మనం పంచుకుందాం" అని బాధితులను నమ్మించి, నకిలీ వస్తువును వారికి ఇచ్చి, బదులుగా బాధితుల మెడలోని అసలైన బంగారు గొలుసులను కాజేస్తారు. కొన్ని సందర్భాల్లో బాధితులకు మత్తు మందు ఇచ్చి స్పృహ కోల్పోయాక నగలతో పరారవుతారని ఎస్పీ వివరించారు.

అరెస్ట్ అయిన వారిలో బోరబండకు చెందిన వేముల లక్ష్మి, కిస్మత్ పురాకు చెందిన చెల్ల నర్సమ్మ, ఫతే నగర్ కు చెందిన బండారి అనిత ఉన్నారు. వీరు కేవలం వికారాబాద్ జిల్లాలోనే కాకుండా నారాయణపేట, సైబరాబాద్, హైదరాబాద్, నిజామాబాద్, రాచకొండ మరియు జగిత్యాల జిల్లాల్లో సుమారు 28 నేరాల్లో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 8 తులాల 8 గ్రాముల బంగారం, 50 తులాల వెండి మరియు 3 సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. అపరిచితులు చెప్పే మాయమాటలను నమ్మి మహిళలు మోసపోవద్దని హెచ్చరించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే డయల్ 100 కి సమాచారం అందించాలని కోరారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ మరియు సిబ్బందిని ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

# ట్రాఫిక్ సిబ్బందికి గాగుల్స్ అందజేత




ఇది కద నిజం : సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ డాక్టర్ గజరావు భూపాల్, ఐపీఎస్., ఈరోజు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ లో గాగుల్స్ అందజేశారు.

రోడ్లపై విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కి కాలుష్యం, ఎండ నుంచి రక్షణ కోసం గాగుల్స్ అందజేశామని ఆయన తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు ఆరోగ్యంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరన్నారు.

ఈ కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంత రావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, కూకట్ పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు, ట్రాఫిక్ సబ్ ఇన్ స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# మార్చి 16 నుండి ఏప్రిల్ 1 వ తేదీ వరకు 10 వ తరగతి పరీక్షలు.

## షెడ్యూల్ విడుదల చేసిన స్కూల్ సెకండరీ విద్యా శాఖ.



ఇది కద నిజం: పదవ తరగతి పరీక్షల షెడ్యూల్ 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు స్కూల్ సెకండరీ విద్యాశాఖ తెలియజేసింది. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల45 నిమిషాల వరకు పరీక్ష నిర్వహణ ఉంటుంది.16 వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్ తో పరీక్ష ప్రారంభం అవుతుంది. 18 వ తేదీఫస్ట్ సెకండ్ లాంగ్వేజ్. 23 వ తేదీ మేధ మెటిక్స్, 25 వ తేదీ ఫిజిక్స్.28 వ తేదీ బయాలజీ.30 వ తేదీ సోషల్.31 వ తేదీ ఫస్ట్ లాంగేజ్ పేపర్ 2.ఏప్రిల్ 1 వ తేదీ ఎస్.ఎస్.సి. ఒకేషనల్ కోర్సు పరీక్ష ఉంటుంది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు అరగంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. పూర్తి సమయం అయ్యేవరకు పరీక్ష హాల నుండి ఎవరిని బయటికి పంపించేందుకు అనుమతించరు.

# ఉపాధి హామీ చట్టం రద్దుకు వ్యతిరేకంగా

# బాపు ఘాట్ వద్ద కాంగ్రెస్ నిరసన



ఇది కద నిజం, హైదరాబాద్:మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (మన్రేగా) రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ, ఏఐసీసీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ పథకం నుండి మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నాయకులు తమ నిరసనను వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ వి. హనుమంతరావు నేతృత్వంలో జరిగిన ఈ ధర్నాలో పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి తారిక్ అన్వర్‌తో పాటు కార్వాన్ ఇంచార్జ్ ఉస్మాన్ అల్ హాజిరి, అఫ్సర్ యూసుఫ్ జాయ్, ఉషశ్రీ, నారాయణస్వామి, శ్రీకాంత్ గౌడ్, చంటి బాబు తదితర నేతలు పాల్గొన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ దీక్షను మధ్యాహ్నం మాజీ మంత్రి తారిక్ అన్వర్, హనుమంతరావుకు నిమ్మకాయ రసాన్ని త్రాగించి విరమింపజేశారు. దేశాభివృద్ధిలో కీలకమైన పథకాన్ని నిర్వీర్యం చేయడం సరికాదని ఈ సందర్భంగా నేతలు అభిప్రాయపడ్డారు.

అనంతరం వి. హనుమంతరావు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత పేదల జీవనాధారమైన ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం దుర్మార్గమని విమర్శించారు. పథకానికి తిరిగి మహాత్మా గాంధీ పేరును పునరుద్ధరించే వరకు తమ పోరాటం ఆగదని, కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా ఒత్తిడి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు. గాంధీజీ ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ప్రజల్లోకి తీసుకెళ్తామని ఆయన హెచ్చరించారు

# సైదాపురంలో నూతన అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య



ఇది కద నిజం, యాదాద్రి: అంగన్వాడి కేంద్రాలు చిన్నారుల ఆరోగ్యం, పోషణ , విద్యకు పునాదిగా నిలుస్తాయని అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం నూతన అంగన్వాడి భవనాలు ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర రోడ్లు,భవనాలు మరియు సినిమా ఆటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రెడ్డి అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామంలో సైదాపురం 1, సైదాపురం 2 అంగన్వాడీ కేంద్రాల భవనాలు SDF, DMF నిధులతో ఒక్కొక్క కేంద్రానికి 15 లక్షల చొప్పున భవనాలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య , జిల్లా కలెక్టర్ హనుమంతరావు తో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఆధునిక సదుపాయాలతో నిర్మించిన ఈ నూతన భవనాల ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు మరింత మెరుగైన సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్దే లక్ష్యంగా భవనాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు.అంగన్వాడి వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ సంకల్పం అన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన నూతన భవనంలో మంత్రి చిన్నారులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు,అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధర్మ రక్షణకు ప్రతి హిందువు కదలాలి



ఇది కద నిజం,కుత్బుల్లాపూర్: హిందూ ధర్మ పరిరక్షణే లక్ష్యంగా, హిందువులందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చింతల్‌లోని జైస్ బాంక్వెట్ హాల్ లో కీలక సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ నెల 24న (జనవరి 24, 2026) బాలాపూర్‌లో జరగనున్న భారీ లి'ధర్మ రక్షణ సభ / హిందూ ఐక్యత సభ'లిను విజయవంతం చేయడంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ గిరివర్ధన్ రెడ్డి, సహ-కన్వీనర్ కట్టా కుమార్ మరియు ప్రముఖ నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం హిందూ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లపై ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయ భూముల కబ్జాలు, హిందూ సంస్కృతిపై జరుగుతున్న దాడులు మరియు ఇతర అక్రమాలను అడ్డుకోవాలంటే హిందూ సమాజం ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేశారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడమే ధర్మ రక్షణ సభ ప్రధాన ఉద్దేశమని వారు పేర్కొన్నారు. బాలాపూర్ సభను చారిత్రాత్మక విజయం చేయాలని, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుండి వేలాదిగా హిందువులు తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరిగే శేఖర్, పులి బాలరాం, కంది శ్రీరాములు, బీజేపీ ఓబీసీ నాయకులు శ్రీధర్, నల్ల జై శంకర్ గౌడ్, గాజుల లక్ష్మి, సుజాత, చంద్రకళ, మహేశ్వరి, డోలీ రజనీకాంత్, సుబ్బారావు, కృష్ణయ్య, సిద్ధి రాములు, వేణుగోపాల్ మరియు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. బాలాపూర్ సభకు వెళ్లాలనుకునే వారు కమిటీ సభ్యులను సంప్రదించి సమన్వయం చేసుకోవాలని కోరారు.

# బంగ్లాదేశీ చొరబాటుదారులను ఏరివేయాలి

- 'చలో బాలాపూర్' కార్యక్రమంలో వై. శ్రీధర్ డిమాండ్



ఇది కద నిజం, హైదర్గూడ : భాగ్యనగర్ ఉత్సవ సమితి పిలుపునిచ్చిన 'జాగో హైదరాబాద్ - చలో బాలాపూర్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం హైదర్గూడలోని గాంధీ విగ్రహం వద్ద ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఉత్సవ సమితి కన్వీనర్ వై. శ్రీధర్ విచ్చేసి మాట్లాడారు. బాలాపూర్ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నివాసం ఉంటున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యా చొరబాటుదారుల వల్ల స్థానికంగా భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, వారిని గుర్తించి అరెస్ట్ చేయాలని, తిరిగి వారి దేశాలకు పంపించి వేయాలని డిమాండ్ చేశారు. శనివారం జరగబోయే 'చలో బాలాపూర్' కార్యక్రమానికి హిందూ సమాజం భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. భాగ్యనగర సంస్కృతిని, భద్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రణవ భక్త సమాజం అధ్యక్షులు నరసింహ, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కొమురయ్య, మరియు కాడం సుధాకర్, విజయ్ కుమార్, సుల్గే వెంకటేష్, జయనంద్ రెడ్డి, పుస్తకాల అశోక్, మేడమ్ మధుసూదన్, సిద్దేశ్వర్, కిరణ్, కిట్టు, సహదేవ రెడ్డి, వరద రాజారెడ్డి, శ్రీరాములు, పెంటల శ్రీధర్ రెడ్డి, పి. సుధాకర్ రెడ్డి, రాము, శివ, సోమారం సూరి, జనార్ధన్ రెడ్డి, సుల్గే అశోక్, ఎల్. వెంకటేష్, జగన్, నరేష్, సతీష్ సహా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, భక్తులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# స్త్రీ శక్తి.. విలీన మండలాలకు లేదు విముక్తి

- కుక్కునూరు, వేలేరుపాడు మహిళలకు 'స్త్రీ శక్తి నో'
- రాజమహేంద్రవరం బస్ డిపో అధికారుల 'అల్ట్రా ప్లాన్'
- ఎమ్మెల్యే మాట్లాడిన తీరు మార్చుకోని అధికారులు
- విలీన మండలాల్లోని మహిళల్లో తీవ్ర అసంతృప్తి




ఇది కద నిజం,కుక్కునూరు: ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూ కూటమి ప్రభుత్వం 'స్త్రీ శక్తి' అనే పథకాన్ని ఆగస్టు 15 నుంచి ప్రారంభించిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలోని మహిళలంతా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఎక్కడి నుంచి ఎక్కడికైనా బస్సు ప్రయాణం చేస్తున్నారు. కానీ, విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మహిళల పరిస్థితి మాత్రం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో "దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదు" అన్న చందంగా మారింది.

కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన 'స్త్రీ శక్తి' పథకాన్ని విలీన మండలాల్లో అమలుపరిచేందుకు మొదటి నుంచీ అడ్డంకులు వస్తూనే ఉన్నాయి. కుక్కునూరు మీదుగా రాజమహేంద్రవరం డిపో బస్సులు భద్రాచలం వెళ్తుంటాయి. వీటి గమ్యస్థానం తెలంగాణ రాష్ట్రంలో ఉండడంతో అంతరాష్ట్ర సర్వీసులుగా మారాయి. దీంతో ఇక్కడి మహిళలకు స్త్రీ శక్తి పథకం వర్తించలేదు. అప్పుడు ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో ఆ బస్సుల గమ్యస్థానాన్ని ఆంధ్రాలోని ఎటపాక గ్రామానికి మార్చారు. దీంతో అవన్నీ రాష్ట్ర సర్వీసులుగా మారిపోయాయి. తద్వారా విలీన మండలాల్లో స్త్రీ శక్తి పథకానికి లైన్ క్లియర్ అయిపోయింది.

ఉచిత బస్సు ప్రయాణం పథకానికి అడ్డంకులు తొలగిపోవడంతో జంగారెడ్డిగూడెం డిపో నుంచి రెండు బస్సులు విలీన మండలాల మీదుగా భద్రాచలం వెళ్తున్నాయి. ఈ సర్వీసుల్లో ఆర్డినరీ బస్సులు తిప్పుతుండడంతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం లభిస్తోంది. దీంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల మహిళలు సంతోషించారు. కానీ, వాళ్ల ఆనందం ఆవిరైపోయేలా రాజమహేంద్రవరం బస్ డిపో అధికారులు కొత్త ప్లాన్ వేశారు. ఇందులో భాగంగానే గతంలో మాదిరిగా భద్రాచలం వెళ్తున్న 9 సర్వీసుల్లో ఎక్స్‌ప్రెస్ బస్సులను తిప్పకుండా.. అల్ట్రా డీలక్స్ బస్సులను నడుపుతున్నారు. దీంతో ఇక్కడి మహిళలు డబ్బులిచ్చే ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాజమహేంద్రవరం నుంచి వచ్చే 9 సర్వీసుల్లోనూ అల్ట్రా డీలక్స్ బస్సులనే తిప్పుతున్నారన్న విషయాన్ని కూటమి నాయకులు గతంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన రాజమహేంద్రవరం డిపో అధికారులతో మాట్లాడారు. అప్పుడు వాళ్లు సుముఖంగానే స్పందించినా.. తర్వాత ఎమ్మెల్యే అభ్యర్థనను సైతం పెడచెవిన పెట్టారు. అలా అప్పటి నుంచి ఇప్పటి వరకూ అల్ట్రా డీలక్స్ బస్సులనే నడుపుతున్నారు. దీంతో రాజమహేంద్రవరం బస్ డిపో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరి దీనిపై ప్రభుత్వం ఎలాంటి ముందడుగు వేస్తుందో వేచి చూడాలి!

### ఆ రూటులోనూ ఫ్రీ బస్ కావాలి

నేను ఆస్పత్రి నిమిత్తం నెలలో రెండు సార్లు రాజమండ్రి వెళ్లాలి. అలా వెళ్లినప్పుడల్లా బస్ చార్జీలకే రూ. 600 వరకూ అవుతుంది. ఆ రూటులో కూడా ఫ్రీ బస్ పెట్టినట్లైతే మాకు ఆ చార్జీ డబ్బులు మిగులుతాయి. ఇకనైనా అధికారులు స్పందించి మాకు ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని కోరుకుంటున్నాను.

– బొమ్మన సత్యవతి, కుక్కునూరు

### కోర్సు కంటే బస్‌కే ఎక్కువ ఖర్చు

కంప్యూటర్ కోర్సు నిమిత్తం నేను ప్రతిరోజూ భద్రాచలం వెళ్తున్నాను. రోజుకు నాకు రూ. 150 బస్ చార్జీలకే ఖర్చు అవుతోంది. ఇలా ప్రయాణానికే నెలకు రూ. 4000 వరకూ ఖర్చు అవుతోంది. మూడు నెలల కోర్సు కోసం ఇన్‌స్టిట్యూట్ వాళ్లు తీసుకునే మొత్తం కంటే ఇదే ఎక్కువ. రాజమహేంద్రవరం డిపో వాళ్లు కూడా అల్ట్రా డీలక్స్‌లు తిప్పకుండా ఎక్స్‌ప్రెస్‌లు నడిపితే ఈ మొత్తం మిగులుతుంది.

– గరగ సాహితి, కుక్కునూరు

### పథకం ఉన్నా పొందలేకపోతున్నాం

మేము గతంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉండేవాళ్లం. ఇప్పుడు పోలవరం కోసం మమ్మల్ని ఆంధ్రాలో కలిపారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఫ్రీ బస్ సౌకర్యం ఉంది. కానీ, మేము ఏ బస్‌లలోనూ ఉచిత ప్రయాణాన్ని పొందలేకపోతున్నాము. ఇకనైనా అధికారులు మా బాధను అర్థం చేసుకోవాలి.

– రమ్య సుధ, కుక్కునూరు